## క్లుప్తంగా

### 13న పొదిలిలో విద్యుత్ అదాలత్

**పొదిలి రూరల్:** స్థానిక మంజునాథ కల్యాణ మండపంలో ఈ నెల 13వ తేదీన విద్యుత్ సమస్యలపై విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏడీఈ డి.హరిబాబు తెలిపారు. కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ విక్టర్ ఇమ్మానియల్, ఫోరం సభ్యులు ఒంగోలు ఆపరేషన్స్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని దర్శి డివిజన్ పరిధిలోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు మండలాల వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

### పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ అమ్మవారు

**మార్కాపురం టౌన్:** మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

### విద్యార్థులకు చెస్ పోటీలు



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి

**బేస్తవారిపేట:** వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు చెస్, డ్రాయింగ్‌పై పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, పుస్తక పఠనం, కథలు చదడంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాల్లో శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు గురుస్వామి కోరారు.

### గ్రంథాలయంలో మాతృదినోత్సవం



విద్యార్థులు, తల్లులతో నిర్వాహకులు

**గిద్దలూరు రూరల్:** పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి మాట్లాడుతూ.. మాతృ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లులను గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. తల్లి రుణం తీర్చుకోలేనిదని, మాతృమూర్తిపై భక్తి భావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యయాదవ్, ప్రముఖులు పాల్గొన్నారు.

### కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

**బేస్తవారిపేట:** మండలంలోని గొట్టమిండ్లు వద్ద కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, సహస్ర నామ, అఖండహారతి, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# బీసీ కాలనీలో సమస్యల తిష్ట



లోవోల్టేజ్‌తో దిమ్మగా వెలుగుతున్న లైటు



పంచాయతీ పైపుల ద్వారా ట్యాంక్‌లో పడుతున్న మురుగునీరు

- పంచాయతీ కొళాయిల ద్వారా మురుగునీరు సరఫరా
- లోవోల్టేజ్‌తో మరమ్మతులకు గురవుతున్న గృహోపకరణాలు
- ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు
- స్పందించని అధికారులు

**కొమరోలు:**

పట్టణంలోని బీసీ కాలనీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీసీ కాలనీలో 60 కుటుంబాల వరకు నివాసం ఉంటుండగా సంబంధిత శాఖల అధికారులు గానీ, సిబ్బంది గానీ ఆ సమస్యలకు పరిష్కారం చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**మంచినీటిలో మురుగునీరు**

గ్రామపంచాయతీ కొళాయిల నుంచి ప్రతి రోజు మురుగునీరు వస్తుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 6 నెలల నుంచి దుర్వాసనతో డ్రైనేజీ నీరు మంచినీటి కొళాయిల ద్వారా వస్తున్నాయని తెలిపారు. అధికారులకు ఈవిషయంపై ఫిర్యాదు చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు.

**లోవోల్టేజ్‌తో దెబ్బతింటున్న గృహోపకరణాలు**

కాలనీ పరిధిలో 3 రోజులుగా లోవోల్టేజ్ సమస్య తలెత్తింది. ఈ సమస్యతో కనీసం మంచినీటి బోరు కూడా ఆడడం లేదు. గృహాల్లో లైట్లు సరిగా వెలగడం లేదని, ఫ్యాన్లు నిదానంగా తిరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. గృహోపకరణ వస్తువులు ఫ్రిజ్, టీవీ, కూలర్, మిక్సీలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు.

**ఇంటి మీద నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు**

గృహాలపై నుంచి విద్యుత్ తీగలు వెళుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు ఉన్న గృహాలు కావడంతో తెలియక విద్యుత్ తీగలను తాకితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే గోడల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని భయాందోళన చెందుతున్నారు. ఇక పారిశుధ్య సమస్యపై చెప్పనవసరం లేదు. వర్షం పడితే చాలు బీసీ కాలనీకి వెళ్లే దారిలోనే వర్షం నీటితో ఆ గుంత స్వాగతం పలుకుతుంది. ఇక డ్రైనేజీ కాలువలో నీరు ఎక్కడికక్కడ నిలువ ఉండడంతో ఆప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ డ్రైనేజీ కాలువ నీరు పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే మంచినీటి పైపులైన్లలో కలుస్తుండడంతో నీరు కలుషితమవుతోంది. రాత్రి వేళల్లో వీధిదీపాలు కూడా వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.



డ్రైనేజీ కాలువలో నిలువ ఉన్న మురికి నీరు

**మంచినీటి సమస్య తీర్చండి**



బీసీ కాలనీలో దుర్వాసనతో కూడిన డ్రైనేజీ నీరు వస్తోంది. ఆ సమస్యను అధికారులు తీర్చాలి. అలాగే విద్యుత్ సమస్య కూడా ఉంది. విద్యుత్ లోవోల్టేజ్ రావడంతో వస్తువులు కాలిపోతున్నాయి. ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

– నాగార్జున, స్థానికుడు

**ఇంటిపై విద్యుత్ వైర్లతో ప్రమాదం**



బీసీ కాలనీలో ఇంటిపై విద్యుత్ వైర్లు ఉండడంతో ఎప్పుడు ఏమవుతుందోనని భయంగా ఉంది. మహిళలు ఉతికిన దుస్తులు పైకి తీసుకుని వెళ్లి ఆరవేయాలన్నా భయం వేస్తోంది. చిన్నపాటి వర్షానికి విద్యుత్ వైర్ల ద్వారా గోడలు తాకడంతో షాక్ కొడుతోంది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యేకు సమస్యలపై వినతిపత్రం అందజేశాం.

– గోపి, స్థానికుడు

**కొత్త కూలర్ రెండు రోజులకే చెడిపోయింది**



బీసీ కాలనీలో 6 నెలల నుంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. అలాగే రెండు రోజుల క్రితం తెచ్చిన కొత్త కూలర్ మరుసటిరోజే లోవోల్టేజ్ సమస్యతో చెడిపోయింది. వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన వస్తువులు లోవోల్టేజ్‌తో మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు సమస్యలను తీర్చాలి.

– పులిగోటి చెన్నకేశవ, స్థానికుడు

**బీసీ కాలనీలో సమస్యలు తీర్చండి**



మా కాలనీలో కరెంటు సరిగా ఉండదు. మంచినీటి సరఫరా ఉండదు. వీధి దీపాలు వెలుగవు. సమస్యలను ఎన్నోసార్లు అధికారులకు తెలిపాం. కానీ పట్టించుకోవడం లేదు. మురికి నీటితో కాలకృత్యాలు ఎలా తీర్చుకోవాలో అర్థం కావడం లేదు.

– రామతులసి, స్థానికురాలు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కంభం రంగరాజు స్కూల్లో గురువులతో పూర్వ విద్యార్థులు



తర్లుపాడులో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

**కంభం:** స్థానిక రంగరాజు ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులందరూ ఆత్మీయంగా పలకరించుకుని, పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించిన నాటి విద్యార్థులను గురువులు అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కామిరెడ్డి రామచంద్రారెడ్డి పూర్వ విద్యార్థుల సంక్షేమ నిధికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బైసాని రామకృష్ణ, ఎంఈఓ ఎ.మల్లికార్జున తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరాజు, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగసుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఇబ్రహీం, మనోరంజని, గురుమూర్తి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**తర్లుపాడు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు కె.గోపాలకృష్ణమూర్తి, జె.కృష్ణమూర్తి, ఎన్‌సీ కృష్ణారెడ్డి, అనివిలాసిని, వెంకటయ్య, షేక్ ఖాశీం వలి, పఠాన్, మహబూబ్‌ఖాన్, కె.పెద్దవాసును సన్మానించారు. మీ ప్రోత్సాహంతో జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగామని ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు కొనియాడారు. పాఠశాలలో కలియతిరిగి నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, చైర్మన్ రాజారాంరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**గిద్దలూరు రూరల్:** ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గిద్దలూరు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేయాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి నాలుగు లేబర్స్ కోడ్స్ తీసుకురావడం అన్యాయమన్నారు. కనీస వేతన చట్టం, పీఎఫ్, ఈఎస్ఐ చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం లాంటి వాటిని ప్రభుత్వం రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. అందుకు నిరసనగా ప్రతి కార్మికుడు సార్వత్రిక సమ్మెకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, థామస్, నూర్జాహాన్, రూతమ్మ, సమీరా, ఎం.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రఫీ

### కంభంలో ముమ్మరంగా పోలీసుల తనిఖీ



రైల్వే స్టేషన్‌లో బ్యాగులు తనిఖీ చేస్తున్న ఎస్సై

**కంభం:** స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం ఎస్సై నరసింహారావు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల బ్యాగులు, లగేజీ, ఇతర వస్తువులు తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కందులాపురం కూడలి, వైజంక్షన్ వద్ద కార్లు తనిఖీ చేశారు. ద్విచక్రవాహనాలు తనిఖీ చేసి లైసెన్స్‌లేని వారు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జిల్లో బస చేసే వారి పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని యజమానులకు సూచించారు.

# గనివానిపాడులో భారీ వర్షం



ఓ వీధిలో నిలిచిన వర్షం నీరు



గనివానిపాడు, వాగుమడుగు మధ్య కోతకు గురైన చప్టా

**కొనకనమిట్ల:** మండలంలోని గనివానిపాడు గ్రామంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వీదులన్నీ జలమయం కావడంతోపాటు గడ్డి వాముల కిందకు భారీగా నీరు చేరిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గనివానిపాడు–వాగుమడుగు మధ్యలో రహదారిపై ఉన్న చప్టా భారీగా కోతకు గురైంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి చప్టా వద్ద శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు కోరారు.

# రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి

**పొదిలి రూరల్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అరాచకం సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి విమర్శించారు.ఆదివారం పొదిలిలో ఆయన మాట్లాడుతూ.. చిలకలూరిపేటలో మాజీ మంత్రి, బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ అయిన విడదల రజనిపై స్థానిక సీఐ సుబ్బనాయుడు, పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు అత్యంత దారుణమన్నారు. మాజీ మంత్రి, మహిళ అనే గౌరవం లేకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని అన్నారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేయడమే కాకుండా, హామీలను ప్రశ్నించే వారిపై పోలీసులను ప్రయోగిస్తూ అక్రమ కేసులు బనాయించడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కూటమి నేతలకు పరిపాటిగా మారిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్సార్ సీపీ అన్నింటికీ సిద్ధంగా ఉందని, కూటమి దురాగతాలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మానుకుని ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు.

## మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు



ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు

**కంభం:** ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కందులాపురం కూడలిలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ఆవరణలో ఉన్నాయి. గత కొంతకాలంగా ఇక్కడ మందుబాబులు రాత్రి పూట, సెలవు దినాల్లో కార్యాలయాల వెనక, చెట్ల కింద కూర్చుని మద్యం తాగుతున్నారు. ఖాళీ సీసాలు, ఇతర వ్యర్థ పదార్థాలను ఉద్యానవనశాఖ కార్యాలయం వెనుక, పీఆర్ కార్యాలయం గేటు ముందు పడేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిరుపయోగంగా ఉన్న భవనంలో సైతం మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే వదిలేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో చెత్తాచెదారం నిండిపోవడంతోపాటు ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## ఘనంగా కపిలగిరి లక్ష్మీనరసింహస్వామి జయంతి



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహ స్వామి

**మార్కాపురం:** మార్కాపురం పరిధిలో గుండ్లకమ్మ నది సమీపంలో వెలసిన కపిలగిరి లక్ష్మీ నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీరంగం రాంబాబు ఆచార్యులు స్వామివారికి వేకువజామున ధ్వజారోహణం, పంచామృతం, సహస్ర నామార్చన పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రి నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్ష్య కార్యదర్శులు బొగ్గరపు శేషగిరిరావు, డీవీ నరసింహారావు, ఇమ్మడిశెట్టి వీరారావు, కేవీ సుధాకర్‌రావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మందుల నిర్ధారణ కోసమే రక్త సేకరణ



పశువుల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న సిబ్బంది

**పొదిలి రూరల్:** పశువులకు గాలికుంటు వ్యాధి, నట్టల నివారణకు వేసిన మందులు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అనే నిర్ధారణ కోసమే రక్తాన్ని సేకరిస్తున్నట్లు విజయవాడ వెటర్నరీ బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తనూజ పేర్కొన్నారు. ఆదివారం పొదిలి మండలంలోని తలమళ్ల గ్రామంలో పర్యటించి పశువుల నుంచి రక్తాన్ని సేకరించించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పశువుల కోసం అందజేస్తున్న మందులు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా తెలుసుకోవడం కోసం పశువుల నుంచి రక్తాన్ని తీసి పరీక్షల నిమిత్తం బెంగళూరులోని కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగర్జునబాబు, ఉన్న గురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి అగ్గిసేవ మహోత్సవం



అగ్గిసేవ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

**గిద్దలూరు రూరల్:** పట్టణంలోని కొండపై లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆదివారం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి అగ్గిసేవ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవార్లతో కూడిన స్వామి వారి పల్లకిని కొండమీదకు ఊరేగింపుగా తరలించారు. రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉప ఆలయాలైన గిరిజానాథస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. 12న గిరిప్రదక్షణ, గరుడోత్సవం, రాత్రి విజయవాడ కళాకారులతో భరతనాట్యం ప్రదర్శనం, 13న భక్తులకు అన్నదానం, రాత్రి గరుడసేవ, గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.